తప్పిపోయిన బాలిక కుటుంబీకులకు అప్పగింత

వినాయక్‌నగర్, జనవరి 4 : నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌రోడ్డు చౌరస్తా వద్ద ఫాతేమా (9) శనివారం ఏడుస్తూ ఉండడాన్ని గమనించిన రూరల్ పోలీస్‌సిబ్బంది ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్సై రమ, హెడ్‌కానిస్టేబుల్ మౌనిక, కానిస్టేబుల్ రమేశ్.. అసద్‌బాబానగర్‌లో బాలిక చిరుమానా తెలుసుకొని, అప్పగించినట్లు రూరల్ ఎస్సై మహ్మద్ ఆరిఫ్ వెల్లడించారు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

వినాయక్‌నగర్, జనవరి 4 : చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన జిల్లాకేంద్రంలో శనివారం తెల్లవారుజామున 5.15 గంటలకు చోటు చేసుకున్నది. మూడో టౌన్ ఎస్సై హరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని గౌతంనగర్ కాలనీలో ఉండే అనసూయ ఇంటి ఎదుట వాకిలి ఊడుస్తుండగా నడుచుకుంటూ వచ్చిన ఓ దుండగుడు.. ఆమె మెడలో నుంచి రెండున్నర తులాల బంగారు గొలుసును తెంపుకొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడిని దోచుకున్న ఘటనలో ముగ్గురు నిందితుల అరెస్టు

వినాయక్‌నగర్, జనవరి 4 : ఈనెల 2న వృద్ధుడిని ఆటోలో తీసుకెళ్లి దోచుకున్న ఘటనలో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు త్రీ టౌన్ ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నగరంలోని హమాల్‌వాడికి చెందిన వృద్ధుడు మాలోత్ సర్దార్ కామారెడ్డి వెళ్లేందుకు బస్సు కోసం తేనె సాయిబాబా ఆలయం ఎదుట నిలబడ్డాడు. ఆటో రిక్షాలో వచ్చిన ముగ్గురు దుండగులు సర్దార్‌ను బలవంతంగా ఆటోలో ఎక్కించుకొని, బెదిరించి, రూ.5,500 నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కొని కంఠేశ్వర్ వద్ద వదిలి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు దుండగులను ఆటోతోపాటు గుర్బాబాదీ రోడ్డులో శనివారం పట్టుకున్నారు. నాందెడ్ జిల్లాకు చెందిన సయ్యద్ బషీర్, నిజామాబాద్ జిల్లాకేంద్రానికి చెందిన అతడి స్నేహితులు షేక్ అలీం, ఖాదర్‌ను నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుల నుంచి నగదు, సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి, ఆటోను సీజ్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ ఠాణా నుంచి చోరీ అయిన బైక్ ఆచూకీ లభ్యం

వినాయక్‌నగర్, జనవరి 4 : నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదుట నుంచి ఐదురోజుల క్రితం చోరీకి గురైన బైక్ ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. బైక్ చోరీకి గురికాగా బాధితుడు బైరి నాగరాజు రెండు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు బైక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దుండగుడు బైక్‌ను చోరీ చేసి, మహారాష్ట్రలోని ఉమ్రి ప్రాంతంలో ఉన్న ఓ కాలనీలో దాచినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడు మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించినా, అతడి ఆచూకీ దొరకలేదని సమాచారం.

చెరువులో పడి వృద్ధురాలు మృతి

డిచ్‌పల్లి, జనవరి 4 : మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన ఎంబడి నాగవ్వ (80) 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న సాంపల్లి చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై షరీఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సాయంత్రం జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని నాగవ్వ బయల్దేరింది. శనివారం ఉదయం బంధువులకు ఫోన్ చేయగా నాగవ్వ రాలేదని వారు బదులిచ్చారు. ఆందోళనకు గురైన కుటుంబీకులు పలు చోట్ల గాలించారు. శనివారం సాయంత్రం సుద్దపల్లి సమీపంలోని సాంపల్లి చెరువులో నాగవ్వ మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవికుమార్

ఖలీల్‌వాడి, జనవరి 4 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి తిరుమలపూడి రవికుమార్ శనివారం ఉదయం తనిఖీ చేశారు. ఉదయం 9 నుంచి ప్రత్యేక తరగతుల నిర్వహణ, అధ్యాపకుల హాజరు, ప్రార్థన, నిర్వహణ తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థిపై అధ్యాపకులు వ్యక్తిగత శ్రద్ధ కనబర్చి, 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుద్ధిరాజ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో బియ్యం నిల్వల తనిఖీ

ధర్పల్లి, జనవరి 4 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బియ్యం నిల్వలు అధికంగా ఉన్నాయన్న సమాచారం మేరకు తహసీల్దార్ మాలతి ఆదేశాలతో ఆర్ఐ రాజేశ్వర్ శనివారం పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. స్టోర్‌రూమ్‌లో కొన్ని, లైబ్రరీలో, మరో గదిలో కొన్ని బియ్యం సంచులు నిల్వ ఉంచడాలన్ని గుర్తించామని, నివేదికను తహసీల్దార్‌కు పంపించినట్లు ఆర్ఐ తెలిపారు. పాఠశాలలో ప్రస్తుతమున్న లెక్కల ప్రకారం సుమారు 4.5 క్వింటాళ్ల వరకు బియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా 12 క్వింటాళ్ల నిల్వను గుర్తించినట్లు తెలిసింది.

పాఠశాలల పరిశీలన..

సారంగాపూర్/ భీమ్‌గల్, జనవరి 4 : రూరల్ మండలంలోని గుండారం జడ్పీహెచ్‌ఎస్‌ను డీసీఈబీ కార్యదర్శి సీతయ్య శనివారం పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉత్తమ మార్కులు సాధించడం ద్వారా కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ఉత్తమ మార్కులు సాధించేలా ప్రణాళికతో చదివించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సమావేశంలో హెచ్ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మండలంలోని మెండోరా ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి శనివారం తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థికీ కనీస సామర్థ్యాలు వచ్చేలా విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో అమలు చేస్తున్న తొలిమెట్టుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. తరగతి గదిలో బోధన విధానాన్ని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఆయనవెంట హెచ్ఎం ముత్తెన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొనసాగుతున్న హమాలీల సమ్మె

డిచ్‌పల్లి, జనవరి 4 : సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకున్నది. హమాలీలు అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ నాయకుడు ఉమయ్య మాట్లాడుతూ.. క్వింటాలుకు రూ.26 నుంచి రూ.29కి పెరిగిన హమాలీల కూలిని వెంటనే అమలుచేయడంతోపాటు ఏరియర్స్ అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, గౌస్, దిలీప్, జాకీర్, బాలాజీ, నాగనాథ్, మనోహర్, లక్ష్మణ్, సంజు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి

కంఠేశ్వర్/ డిచ్‌పల్లి, జనవరి 4 : రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను శనివారం కలిసి సమస్యలను విన్నవించారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంబోజి హరిప్రసాద్, అధికార ప్రతినిధి అరుణ్‌కుమార్, సుజన్‌రెడ్డి, కళాశాలల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

టీయూలో రేపటి నుంచి ఖేల్ ఉత్సవాలు

డిచ్‌పల్లి, జనవరి 4 : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని టీయూలో ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో ఖేల్ ఉత్సవాలను ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్‌చారి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను టీయూలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈనెల 4 నుంచి 5 వరకు రిజిస్ట్రేషన్, 6 నుంచి 10 వరకు ఖేల్ ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, వైస్ ప్రెసిడెంట్ పావనిని సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆ పార్టీ ధర్పల్లి నాయకులు హైదరాబాద్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్పల్లి మండల మాజీ అధ్యక్షుడు నల్ల హన్మంత్‌రెడ్డి, ఇందల్వాయి మాజీ ఎంపీపీ రమేశ్‌నాయక్ కేటీఆర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
– ధర్పల్లి, జనవరి 4

జనరేటర్లకు నిప్పంటించిన దుండగులు

డిచ్‌పల్లి, జనవరి 4 : మండలంలోని నడ్పల్లి గ్రామశివారులో ఉన్న శ్రీలక్ష్మి రెడిమిక్స్ కాంక్రీట్ కంపెనీలో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి జనరేటర్లపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. కంపెనీ యజమాని వేణుమాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఆపరేటింగ్ క్యాబిన్‌కు నిప్పంటించారని పోలీసులు తెలిపారు.

పతంగుల షాపులపై దాడులు

వినాయక్‌నగర్, జనవరి 4 : ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ ఆదేశాల మేరకు జిల్లాకేంద్రంలోని కైట్ షాపులపై సీసీఎస్ టీమ్ శనివారం దాడులు నిర్వహించింది. పలు షాపుల్లో నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్నట్లు గుర్తించి, 20 బెండళ్ల మాంజాను సీజ్ చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని, రెండో టౌన్ ఎస్సై యాసిన్ అరాఫత్‌కు అప్పగించారు. సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.

డిమాండ్ డే పోస్టర్ల ఆవిష్కరణ

సిరికొండ, జనవరి 4 : రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న డిమాండ్ డే నిర్వహించనున్నట్లు ఏఐయూకేఎస్ జిల్లా సహాయకార్యదర్శి బాబన్న తెలిపారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై సవతి ప్రేమ చూపుతున్నదని, రైతులు పోరాటం చేసిన సమయంలో హామీలు ఇచ్చి విస్మరించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, లింబన్న, కిశోర్, ఆశిష్‌రాజ్, అనీస్ పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో లూయీ బ్రెయిలీ జయంతి

ఖలీల్‌వాడి, జనవరి 4 : కలెక్టరేట్ సమీపంలోని బైపాస్ రోడ్డులో ఉన్న స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ జిల్లా అంధుల వనరుల కేంద్రంలో లూయీ బ్రెయిలీ 216వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై లూయీ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెప్పులు కుట్టే కుటుంబంలో జన్మించి చిన్నవయస్సులో కంటిచూపు కోల్పోయిన లూయీ బ్రెయిలీ అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు బ్రెయిలీ లిపిని కనుగొన్నాడని వివరించారు. అంధులకు విద్య, వైద్యం అందించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రసూల్ బీ, ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ఎంఈవో వెంకటనారాయణగౌడ్, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, అంధుల ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయన్న, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

విద్యార్థులకు అల్పాహారం అందజేయాలని వినతి

ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు, పొతంగల్ గ్రామస్తులు

పొతంగల్, జనవరి 4 : ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం అందజేయాలని స్థానికులు విద్యార్థులతో కలిసి ఎంఈవో శంకర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యాశాఖ నవంబరు మొదటి వారం నుంచి పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను ప్రారంభించిందని, గతేడాది ఇచ్చిన విధంగా స్నాక్స్ పంపిణీ చేస్తారనుకుంటే ఈసారి ఆ జాడే లేదన్నారు. ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరిన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వచ్చేసరికి చీకటి పడుతున్నదని, కేవలం మధ్యాహ్న భోజనంతో సరిపెట్టుకోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం స్పందించి దాతల సహకారంతో అల్పాహారం అందేలా చూడాలని కోరారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు సన్మానం

క్రీడాకారులను సన్మానిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జనవరి 4 : మండలంలోని పడకల్ జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు జాతీయస్థాయి ఫిస్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి, తెలంగాణ జట్టును చాంపియన్ నిలిపారు. ఈ సందర్భంగా వారిని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో శనివారం సన్మానించారు. డీఈవో అశోక్ సైతం తన కార్యాలయంలో విద్యార్థులను సన్మానించారు. డిసెంబర్ 27 నుంచి 30 వరకు తమిళనాడు, పంజాబ్‌లో నిర్వహించిన జాతీయస్థాయి ఫిస్ట్‌బాల్ టోర్నమెంట్‌లో విద్యార్థులు శివరామకృష్ణ, విష్ణువర్ధన్, కళ్యాణి, జగదీశ్వరి, సలోని, తేజ పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం సురేందర్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం లింగన్న, పడకల్ వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ విద్యార్థి ఎంపిక

సిరికొండ, జనవరి 4 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేటి (ఆదివారం) నుంచి ఈనెల 9 వరకు మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడామైదానంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అండర్–18 సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి ఎస్.సిద్ధార్థ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. గత నెల 7 నుంచి 9వ తేదీ వరకు ఆర్మూర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు చెప్పారు. సిద్ధార్థను ప్రిన్సిపాల్‌తోపాటు ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్ శనివారం అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంపీడీవో

మోర్తాడ్, జనవరి 4: కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గణిత స్టడీ మెటీరియల్‌ను ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య శనివారం అందజేశారు. ఆ పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ రూ.4వేలతో 25 మందికి ఈస్టడీ మెటీరియల్‌ను కొనుగోలు చేసి ఇచ్చారు. వీటిని అతిథులు పంపిణీ చేశారు. స్టడీమెటీరియల్‌ను అందించిన హెచ్ఎంను ఎంపీడీవో, ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు.

కోడిపందేలు నిర్వహిస్తున్న 13 మంది అరెస్ట్

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్4: ఆర్మూర్ పట్టణంలో దూదేకుల కాలనీలో శనివారం కోడిపందేలు నిర్వహిస్తున్న 13 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. పోలీసుల కథనం.. విశ్వసనీయ సమాచారం మేరకు కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేసి 13 మందిని అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. వీరి నుంచి కోడి కత్తులు, రూ.7,380 నగదు, 11 సెల్‌ఫోన్లు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మహిపాల్

రుద్రూర్‌లో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు

వేల్పూర్, జనవరి 4: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని అంక్సాపూర్ గ్రామంలో పార్టీ జిల్లా నాయకుడు మిట్టాపల్లి మహిపాల్ ఆధ్వర్యంలో నాయకులు విలేకరులతో మాట్లాడారు. యేడాది గడిచినా రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. మళ్లీ దరఖాస్తుల పేరిట బురిడీ కొట్టిస్తున్న ప్రభుత్వానికి రైతులు గుణపాఠం చెబుతారన్నారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై కాంగ్రెస్ పార్టీని చిత్తుగా ఓడించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. రైతు భరోసా పేరిట కాంగ్రెస్ పార్టీ తప్పుడు మాటలు చెప్పి అధికారం చేపట్టిందని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు.

బీఆర్‌ఎస్ పటిష్టతకు కృషిచేయాలి

రుద్రూర్, జనవరి 4 : బీఆర్‌ఎస్ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జి గాండ్ల మధు అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం బీఆర్‌ఎస్‌ను వీడినంత మాత్రాన పార్టీకి నష్టం లేదన్నారు. ఎమ్మెల్సీ కవిత బాన్సువాడ నియోజకవర్గానికి బాధ్యులను నియమించనున్నారని తెలిపారు. సమావేశంలో నాయకులు నీరడి సాయిలు, పున్న పుర్గయ్య, సాయికిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు భూమేశ్వర్

ముప్కాల్, జనవరి 4: మండల కేంద్రానికి చెందిన వినయ్–నివేదిత దంపతుల బిడ్డ ప్రాణాపాయ స్థితిలో ఉన్న విషయం తెలుసుకున్న ముప్కాల్ మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి తనవంతు సాయంగా రూ.5వేలను బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు. దాతలు ముందుకు వచ్చి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యుడు మునీరుద్దీన్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, కుమ్మరి సుఖీదాస్, దాసరి నర్సింగ్‌దాస్, ఓజా ప్రకాశ్, ముఖీద్, గద్దల రమేశ్, లింగపురం చిన్నయ్య తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాల్కొండ, జనవరి 4: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2025–26 సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి పూర్తి స్థాయిలో, 7, 8, 9,10 తరగతులల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు http://telanganams.cgg.gov.in/ అనే వెబ్‌సైట్‌లో లేదా మీసేవ కేంద్రంలో దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 13న ఉంటుందని తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

వేల్పూర్/ముప్కాల్, జనవరి 4: తరుచూ జరుగుతున్న ఆటో ప్రమాదాలు నివారణపై మండల కేంద్రంలో ఆటో యూనియన్ సభ్యులతో శనివారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై సంజీవ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మల్లేశ్, మాణిక్యం, ఆత్మరాం, షర్ఫుద్దీన్ పాల్గొన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని టూ వీలర్, త్రీ వీలర్ వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ముప్కాల్ ఏఎస్సై సురేశ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ముప్కాల్ ఏఎస్సై సురేశ్, ఆర్టీవో అధికారులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శక్కర్‌నగర్, జనవరి 4: విద్యార్థినులు మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని షీటీం అధికారులు విజయ్, గౌతమి సూచించారు. శనివారం బోధన్ పట్టణం శక్కర్‌నగర్ మధుమలంచ హైస్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీటీం సభ్యులు విద్యార్థినులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మహిళలకు ఇబ్బందులు ఏర్పడినా, ఈవ్‌టీజింగ్‌కు గురైనా షీటీంకు లేదా 100 నంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో కత్తిపోట్ల కలకలం

ఎడపల్లి, జనవరి 4: మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద ఉన్న గైని ప్రాంతంలో శుక్రవారం రాత్రి యువకుల మధ్య చెలరేగిన వివాదం కత్తిపోట్లకు దారి తీసింది. స్థానికుల కథనం ప్రకారం.. యువకులు మద్యం మత్తులో ఒకరినొకరు దూషించుకున్నారు. మాటామాట పెరగడంతో ఓ యువకుడిపై పలువురు కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన యవకుడి అరుపులు విన్న ఆయన తల్లి ఘటన స్థలానికి చేరుకొని యువకుడిని బంధువుల సాయంతో బోధన్ దవాఖానకు తరలించింది. కత్తి పోట్ల విషయంపై పోలీసులు సమాచారం సేకరించినట్లు తెలిసింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
హైదరాబాద్ రోడ్ శాఖ (05961)
5-6-507/11, హైదరాబాద్ రోడ్, ద్వారకానగర్, నిజామాబాద్-503001

స్వాధీనతా ప్రకటన
{8(1)} (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ రోడ్ శాఖ** (05961) యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన బకాయి మొత్తం 13.09.2024 నాటికి **రూ. 27,61,355.26 (ఇరవై ఏడు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల యాభై ఐదు రూపాయల ఇరవై ఆరు పైసలు మాత్రమే)** + వడ్డీ మరియు HL001లో తెలిపిన నెలవారి వాయిదాలతో తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత/హామీదారు/తనఖాదారు: **1. శ్రీ సిర్న వెంకట రమణ తండ్రి సిర్న రామలింగం,** A) ఇం.నెం.6-9-79, నామ్‌దేవ్‌వాడ, 3 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన, నిజామాబాద్, సుభాష్‌నగర్-503002, B) ఇం.నెం.6-8-15/బి, నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్, తెలంగాణ-503002, C) ఇం.నెం.3-9-419, ఎస్‌బిహెచ్ చౌక్, ఆదిలాబాద్, తెలంగాణ-504001. **2. శ్రీమతి సిర్న పల్లవి భర్త శ్రీ సిర్న వెంకట రమణ,** A) ఇం.నెం.6-9-79, నామ్‌దేవ్‌వాడ, 3 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన, నిజామాబాద్, సుభాష్‌నగర్-503002, B) ఇం.నెం.6-8-15/బి, నామ్‌దేవ్‌వాడ, నిజామాబాద్, తెలంగాణ-503002, C) ఇం.నెం.3-9-419, ఎస్‌బిహెచ్ చౌక్, ఆదిలాబాద్, తెలంగాణ-504001. D) ఇం.నెం.3-3-480/1, గాయత్రి నగర్, నిజామాబాద్, తెలంగాణ-503001, **3. శ్రీ సిర్న మహేష్ తండ్రి సిర్న రామలింగం,** A) ఇం.నెం.6-9-79, నామ్‌దేవ్‌వాడ, 3 టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన, నిజామాబాద్, సుభాష్‌నగర్-503002, B) ఇం.నెం.3-3-480/1, గాయత్రి నగర్, నిజామాబాద్, తెలంగాణ-503001 వారిని కోరుతూ 13-09-2024 తేదీగల డిమాండ్ నోటీసు జారీ చేశారు.

రుణగ్రహీత /హామీదారులు/తనఖాదారులు సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **03-01-2025న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవి జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు 13-09-2024 నాటికి **రూ. 27,61,355.26 (ఇరవై ఏడు లక్షల అరవై ఒక్క వేల మూడు వందల యాభై ఐదు రూపాయల ఇరవై ఆరు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ మరియు నెలవారి వాయిదాలు కలిపి సదరు మొత్తం కొరకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ రోడ్ శాఖ** (05961) చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత/హామీదారులు/తనఖాదారులను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

గాయత్రి నగర్, నిజామాబాద్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వద్ద గల, సర్వే నెం.795లో 147.50 చ.గజాలు లేదా 123.32 చ.మీటర్లు విస్తీర్ణం, ప్లాట్ నెం.4లో నిర్మించబడిన, MPL నెం.3-3-480/1 కలిగిన ప్రస్తుతమున్న ఆర్‌సిసి రూఫ్ నివాస ఇల్లు యావత్తు, **సరిహద్దులు:** ఉత్తరం: పొరుగువారి ప్లాట్, దక్షిణం: ప్లాట్ నెం.05, తూర్పు: ప్లాట్ నెం.10, పడమర: 20'-00'' వెడల్పు రోడ్.

పైన తెలిపిన ఆస్తి **శ్రీ సిర్న వెంకట రమణ తండ్రి శ్రీ ఎస్.రామలింగం**కు చెందినది మరియు ఇది ఫ్రీహోల్డ్ ప్రాపర్టీ.

ప్రచురణ తేది: 05-01-2025 **అధీకృత అధికారి,**
ప్రదేశం: నిజామాబాద్ **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.**

విజయవంతం చేయాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి4: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించనున్న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) నాయకులు కోరారు. పట్టణంలోని ఏఐయూకేఎస్ కార్యాలయంలో ఆల్ ఇండియా డిమాండ్ డే పోస్టర్లను ఆసంఘం నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఆసంఘం ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు గంగన్న మాట్లాడుతూ ఈ నెల 9న ఆల్ ఇండియా డిమాండ్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు దేవారాం, కిషన్, తలారి గంగాధర్, అరవింద్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

బోధన్ రూరల్, జనవరి 4: సాలూరా మండలంలోని తగ్గెల్లి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఐ లయ్‌మై విలేజ్ ఫౌండర్ నాగేంద్ర, పీఆర్టీయూ నాయకుడు రవికిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక ముందు కూడా తగ్గెల్లి పాఠశాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కో ఆర్డినేటర్ ప్రభావతి, ఉపాధ్యాయులు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

డి-3, డి-4 కాలువలకు నీటివిడుదల

మోర్తాడ్, డిసెంబర్ 4: లక్ష్మీకాలువ నుంచి శనివారం డి–3 కాలువకు 105 క్యూసెక్కులు, డి–4 కాలువకు 53 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. డి–1కు రెండు క్యూసెక్కులు, డి–2కు 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వివిధ కాలువల ద్వారా నీటివిడుదల కొనసాగుతున్నది. కాకతీయకాలువకు 5500, లక్ష్మీకాలువకు 200, అలీసాగర్ ఎత్తిపోతలకు 405, గుత్ప ఎత్తిపోతలకు 270, సరస్వతీ కాలువకు 700, వరద కాలువకు 5వేలు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా ప్రాజెక్టులో 1088.00అడుగులు(72.23టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్‌వైర్ చోరీ

బోధన్ రూరల్, జనవరి 4: గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి తీగను దోచుకెళ్లిన ఘటన బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని లింగం రెడ్డి వ్యవసాయ పొలంలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి తీగను దోచుకెళ్లారు. శనివారం అటుగా వెళ్లిన రైతులు ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైనట్లు గుర్తించి విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. లైన్‌మెన్ సలీమ్ బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మురికి నీరు చెరువులో కలవకుండా చూడాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి4: మురికి నీరు చెరువులో కలవకుండా చూడాలని కోరుతూ పట్టణంలోని కొటార్మూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం మున్సిపల్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొటార్మూర్ శివారులోని చెరువులో మురికి నీరు కలుస్తున్నదని అన్నారు. చెరువులోని నీరు కలుషితం అవుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

7న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నవీపేట, జనవరి 4: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ లో ఈనెల 7న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ప్రశాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవీపేట, జన్నేపల్లి సెక్షన్స్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సమస్యలుంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

మోర్తాడ్, జనవరి 4: కమ్మర్‌పల్లి మండలంలోని కేసీ తండాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు సంబంధించిన వివరాలను ఎంపీడీవో రాజశ్రీనివాస్ పరిశీలించారు. అనంతరం ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.